

ఏసీబీ వలలో ఎస్‌ఐ, కానిస్టేబుల్
తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లోని ఎస్‌ఐ, కానిస్టేబుల్ నాగరాజు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికారు.
- 8లో



గంజాయి కేసులో ముగ్గురి అరెస్ట్
గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను మోతె మండలం మామిళ్లగూడెం శివారులో పోలీసులు పట్టుకున్నారు.
- 8లో



పాఠశాలపై మమకారం
మోత్కూరుకు చెందిన లక్ష్మీనర్సయ్య తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సాయం అందించి ఆదర్శంగా నిలుస్తున్నారు.
- 9లో

న్యూస్‌రీల్

హనుమంతుడికి ఆకుపూజ



ఆంజనేయస్వామికి హారతినిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి క్షేత్రపాలకుడిగా ఉన్న శ్రీఆంజనేయస్వామికి అర్చకులు మంగళవారం ఆకుపూజను విశేషంగా నిర్వహించారు. ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. హనుమంతుడికి ఇష్టమైన నైవేద్యం సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగాయి. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం వెండి జోడు సేవ పూజలు నిర్వహించారు.

బాధితులకు న్యాయం చేయాలి



రిలే నిరాహార దీక్ష చేస్తున్న వారికి మద్దతు తెలుపుతున్న సీపీఐ, బీజేపీ నాయకులు

యాదగిరిగుట్ట: రూ.10కోట్లతో ఉడాయించిన జై భవాని జ్యూవెలరీ యజమాని దత్తును పోలీసులు పట్టుకొని, బాధితులకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కల్లెం కృష్ణ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ పోలీసులను డిమాండ్ చేశారు. మంగళవారం యాదగిరిగుట్ట పట్టణంలోని జై భవాని జ్యూవెలరీ దుకాణం ఎదుట రిలే నిరాహార దీక్ష చేస్తున్న బాధితులకు వారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిత్తును పట్టుకునేంత వరకు పట్టణంలోని జ్యూవెలరీ దుకాణాలు, మార్వాడీ దుకాణాలు తీయొద్దని పోలీసులకు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదేశాలు ఇచ్చారని, కానీ స్థానిక నేతల అండతో దుకాణాలు తీసేందుకు యత్నిస్తున్నారన్నారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకు వారి పక్షాన పోరాటం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బెలిదే అశోక్, పేరబోయిన మహేందర్, పేరబోయిన బంగారు, బుచ్చిబాబు, బందారపు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ స్కూల్ మేనేజ్‌మెంట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్నిక



జలందర్‌రెడ్డిని సన్మానిస్తున్న బడ్జెట్ పాఠశాలల నిర్వాహకులు

భువనగిరి: బడ్జెట్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భువనగిరి పట్టణంలోని విజ్ఞాన్ ఐటీ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ పగిడాల జలందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం భువనగిరి పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బడ్జెట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మిరియాల దుర్గాప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, యాదయ్య, శ్రీరామ్, చంద్రశేఖర్, బాల్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, పడాల వెంకటేశం, మజీద్ బాబా, జానీ తదితరులు పాల్గొన్నారు.

మీరేం చేశారో చెప్పండి!



ర్యాలీలో అభివాదం చేస్తున్న మాజీ మంత్రి కేటీఆర్



నల్లగొండలోని క్లాక్ టవర్ వద్ద రైతు మహాధర్నాకు హాజరైన రైతులు, బీఆర్‌ఎస్ శ్రేణులు

- మహా ధర్నాను అడ్డుకోవడం కాదు..
- దమ్ము ధైర్యం ఉంటే కోమటిరెడ్డి.. గడియారం సెంటర్‌లో మీటింగ్ పెట్టు
- రైతుల ర్యాలీ చూస్తుంటే కేసీఆర్ విజయోత్సవ ర్యాలీలా ఉంది
- ప్రజాశక్తి ముందు ఏ శక్తీ గొప్పది కాదు
- రైతు మహా ధర్నాలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మహా ధర్నా సక్సెస్.. బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్..

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రైతు మహా ధర్నాను అడ్డుకోవడం కాదు.. దమ్ము, ధైర్యం ఉంటే గడియారం సెంటర్‌లో మీటింగ్ పెట్టి రైతులకు మీ ప్రభుత్వం ఏమి చేసిందో చెప్పండి.. అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాలు విసిరారు. మంగళవారం నల్లగొండ గడియారం సెంటర్‌లో నిర్వహించిన రైతు మహా ధర్నాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి అహంకారం, ఆకారాలు పెరిగాయి తప్ప వారు రైతులకు చేసిందేమీలేదని దుయ్యబట్టారు. తాము యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం, యాదాద్రి పవర్ ప్లాంట్‌ను నిర్మించామని, రైతుల కోసం 11 సార్లు రైతుబంధు, రైతుబీమా ఇచ్చామని, రుణ మాఫీ చేశామన్నారు. వారు రైతులకు ఏం చేశారో గడియారం సెంటర్‌లో మీటింగ్ పెట్టి చెప్పాలన్నారు.

విజయోత్సవ ర్యాలీలా అనిపించింది

'నల్లగొండకు వస్తుంటే ఐటీ హబ్ కళ తప్పి కనిపించింది. అందులో కోమటిరెడ్డి మనుషులు ఉంటున్నారో.. లేకపోతే తాగుబోతులకు నిలయమైందోగానీ ఐటీ హబ్ కళ తప్పి కనిపించింది..' అన్నారు. 'ఎన్టీఆర్ విగ్రహం వద్దకు వచ్చాక మహాధర్నాకు వచ్చిన నాకు భారీ స్వాగతం పలికారు. భారీ ఎత్తున ర్యాలీ తీశారు. ఆ జనాలను చూస్తుంటే కేసీఆర్ మళ్లీ సీఎం అయ్యారు.. భూపాల్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లుగా కనిపించింది..' అని అన్నారు.

దున్నపోతును తెచ్చుకున్నామంటున్నరు

'హైదరాబాద్ నుంచి వస్తుంటే పెద్దకాపర్తి వద్ద చిరుమర్తి లింగయ్య ఆపారు. అక్కడ ఓ రైతు తనను కలిసి 'పాలిచ్చే ఆవును అమ్మి ఎగిరెగిరి తన్నే దున్నపోతును కొనుక్కున్నట్లుంది..' అని అన్నారు. అప్పుడు రైతుబంధు వచ్చేది. రైతుబీమా వచ్చేది.. ఇప్పుడు రావడం లేదంటూ రైతు చెప్పిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు.

ప్రజా శక్తి ముందు ఏ శక్తీ గొప్పది కాదు

ప్రపంచంలో ఏ శక్తి ప్రజా శక్తి కంటే గొప్పది కాదని కేటీఆర్ పేర్కొన్నారు. ఆ నిజాన్ని పోరాటాల గడ్డ నల్లగొండ రుజువు చేసిందన్నారు. బండెనక బండి కట్టి పదహారు బండ్లు కట్టి ఏ బండ్లో పోతవ్ కొడుకో నైజాం సర్కారోడ అని నైజామ్‌ను నిలదీసిన గడ్డ నల్లగొండ అని అన్నారు. పక్కన కృష్ణమ్మ ఉన్నా ప్రయోజనం లేదు. పాలమూరు నల్లగొండ జిల్లాలు నీరు లేక ఆనాడు ఇబ్బందులు పడ్డాయన్నారు. కేసీఆర్ ఆనాడు పాలమూరు వలసల మీద పాట పాడారని, అదే కాదు చూడు..చూడు నల్లగొండ. గుండె నిండా ఫ్లోరైడ్ బండ అంటూ పాట రాసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల్లో అన్నీ అమలు చేయలేక అబద్ధాలు ఆడుతున్నారన్నారు. నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్‌కు కాంగ్రెసే కారణమన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత కృష్ణా నీటిని నల్లగొండకు అందించి ఫ్లోరైడ్‌ను తరిమికొట్టామని, సాగునీటిని అందించి ధాన్యం పండించడంలో తెలంగాణలో నల్లగొండను నెంబర్ వన్ స్థానంలో నిలిపామన్నారు. తాము రెండు పంటలకు నీరందిస్తే, కాంగ్రెస్ పాలనలో ఒక్క పంటకూ నీరిచ్చే దిక్కులేకుండా పోయిందన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్న కొందరు పోలీసులు

కొందరు పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. నల్లగొండలో ఫ్లెక్సీల తొలగింపు విషయంలో ధర్నా చేస్తే మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని అరెస్టు చేయడం వంటివి చేశారన్నారు. కొందరు పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరించారని, అంతా గుర్తు పెట్టుకుంటామన్నారు. తాము అధికారంలోకి వస్తామని, వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు.

గులాబీ శ్రేణుల్లో జోష్ నింపిన కేటీఆర్

నల్లగొండ గడియారం సెంటర్‌లో బీఆర్‌ఎస్ నిర్వహించిన రైతు మహా ధర్నా సక్సెస్ అయింది. పోలీసులు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే అనుమతి ఇచ్చారు. ఆ సమయంలోనే ధర్నా నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. గడియారం సెంటర్ అంతా గులాబీ మయమైంది. హైదరాబాద్‌రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద పార్టీ శ్రేణులు కేటీఆర్‌కు స్వాగతం పలికారు. భారీ ర్యాలీగా గడియారం సెంటర్‌కు చేరుకున్నారు. అనుమతి ఇచ్చిన సమయానికంటే ముందుగానే కేటీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు. ఉమ్మడి జిల్లా నుంచి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వారిలో ఉత్సాహం నింపేలా కేటీఆర్ ప్రసంగించారు.



కార్యకర్త వినూత్న నిరసన



చిట్యాల : పెద్దకాపర్తి వద్ద బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న కేటీఆర్



నల్లగొండలోని క్లాక్‌టవర్ వద్ద రైతు మహాధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్, పక్కన జగదీశ్‌రెడ్డి, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, బీఆర్‌ఎస్‌పార్టీ నాయకులు

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



ఎంజీయూ వద్ద అభివాదం చేస్తున్న కేటీఆర్

నల్లగొండ టూటౌన్ : యూనివర్సిటీల సమస్యలు, విద్యార్థుల ఇబ్బందులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని.. విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. రైతు మహాధర్నా కోసం నల్లగొండకు వచ్చిన కేటీఆర్ యూనివర్సిటీ విద్యార్థుల కోరిక మేరకు అన్నెపర్తి సమీపంలో ఉన్న మహాత్మాగాంధీ యూనివర్సిటీ వద్ద ఆగి విద్యార్థుల సమస్యలు, యూనివర్సిటీలో వసతుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు యూనివర్సిటీ సమస్యలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో రేవంత్ ప్రభుత్వం విఫలమైందన్నారు. గొడ్డు కారం వేసి పెడుతున్నారని స్వయంగా విద్యార్థులే చెబుతుండడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం కాదా అని ప్రశ్నించారు. యూనివర్సిటీ లోపలికి రావాలని విద్యార్థులు కేటీఆర్‌ను కోరగా అనుమతి లేకుండా లోపలికి వస్తే మీపై కేసులు పెట్టి వేధిస్తారని, సమస్యల పరిష్కారం కోసం మీ తరపున పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, బాల్క సుమన్, విద్యార్థి నాయకుడు బొమ్మరబోయిన నాగార్జున ఉన్నారు.

కాంగ్రెస్ మోసం.. రైతులకు శాపం



రైతు మహాధర్నాలో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: రైతులకు హామీలు ఇచ్చి అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని, రైతాంగం తిరుగుబాటు చేస్తుంటే అక్రమ కేసులు పెట్టి అణచివేయాలని చూస్తున్నారని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. రైతు మహాధర్నాలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలు కోరితేనే కేసీఆర్ సీఎం అయ్యాడన్నారు. పిల్లలకు చాక్లెటు ఇచ్చి దొంగలు ఎత్తుకెళ్లినట్లు రైతులకు హామీ ఇచ్చి కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి మోసాన్ని చెప్పేందుకే కేటీఆర్ నల్లగొండ వచ్చాడని అన్నారు. నల్లగొండలో ఆకు రౌడీలు ఏమీ చేయలేరని అన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ.. రైతు బంధు కింద రూ.15 వేలు ఇస్తామని చెప్పి రైతును మోసం చేశాడని, ఎకరానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 17,500 బాకీ పడిందన్నారు. ధాన్యం బోనస్ రూ.500 ఎగ్గొట్టిందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కేటీఆర్ రైతు ధర్నాకు వస్తానంటే కాంగ్రెస్ నాయకులకు దడ పుడుతుందన్నారు. ఆరు గ్యారంటీలతో ప్రజలను మోసం చేశారని అన్నారు. ఇంకా ఈ ధర్నాలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునిత, గాదరి కిషోర్‌కుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, బొల్లం మల్లయ్యయాదవ్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, నోముల భగత్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, నిరంజన్‌రెడ్డి, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, నాయకులు బండా నరేందర్‌రెడ్డి, బడుగుల లింగయ్య యాదవ్, కంచర్ల రామకృష్ణారెడ్డి, చిరుమర్తి లింగయ్య, బూడిద బిక్షమయ్యగౌడ్, తిప్పన విజయసింహారెడ్డి, కర్నె ప్రభాకర్, గొంగిడి మహేందర్‌రెడ్డి, చాడ కిషన్‌రెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి, అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి, పాల్వాయి స్రవంతి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, దూదిమెట్ల బాలరాజు, రాకేష్‌రెడ్డి, రామచంద్రనాయక్, మందడి సైదిరెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, బోనగిరి దేవేందర్ పాల్గొన్నారు.



కరీంనగర్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న యాదాద్రి జోన్ జట్టు

కార్యదర్శులపై పనిభారం

- పాలకవర్గాలు ముగియడంతో అన్నీతామై వ్యవహరిస్తున్న కార్యదర్శులు
- రెవెన్యూ, గృహ నిర్మాణం, ఉపాధి శాఖల పనులతో ఒత్తిడి
- నిధుల లేమితో సమస్యలు పరిష్కారం కాక.. ప్రజలకు సమాధానం చెప్పలేక సతమతం



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు (ఫైల్)

రామన్నపేట: ఏడాదిగా పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో అన్నీ తామై వ్యవహరిస్తున్న కార్యదర్శులకు పని భారం పెరుగుతోంది. రోజువారీ విధులతోపాటు సర్వేలు, పథకాలకు సంబంధించి లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయడం తలకు మించిన భారంగా మారుతోంది. దీనికితోడు నిధుల లేమితో సమస్యలు పరిష్కారం కాక ప్రజలకు సమాధానం చెప్పలేక సతమతమవుతున్నారు.

భారంగా మారిన పంచాయతీల నిర్వహణ

జిల్లాలో 428 గ్రామపంచాయతీలు ఉన్నాయి. గతేడాది ఫిబ్రవరి 1వ తేదీతో పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసింది. ప్రభుత్వం సర్పంచ్‌ల స్థానంలో మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించింది. నిధులు లేకపోవడంతో వీధి దీపాల ఏర్పాటు, పారిశుద్ధ్యం మెరుగు, మంచినీటి సరఫరా వంటి ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు పంచాయతీ కార్యదర్శులపై ఆర్థికభారం పడుతోంది.

ఓ వైపు సర్వేలు.. మరోవైపు ఆన్‌లైన్ నమోదు

పంచాయతీ కార్యదర్శులకు ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు వంటి కొత్త కష్టాలు మొదలయ్యాయి. ఆన్‌లైన్ చేసే క్రమంలో మండలానికి 200 నుంచి 300 వరకు దరఖాస్తులు నమోదు కాలేదు. ఆ కుటుంబాల వారు గృహలక్ష్మీ (సబ్సిడీ గ్యాస్), గృహజ్యోతి పథకాలను పొందలేకపోతున్నారు. క్షేత్రస్థాయిలో దరఖాస్తులు స్వీకరించిన పంచాయతీ కార్యదర్శులు వారికి సమాధానం చెప్పలేకపోతున్నారు. ఇటీవల చేపట్టిన సామాజిక, ఆర్థిక సర్వే, నమోదు ప్రక్రియ మానిటరింగ్ బాధ్యతను పంచాయతీ కార్యదర్శులే నిర్వర్తించారు.

అన్నింటికీ కార్యదర్శే జవాబుదారీ..

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డుల జారీకి సంబంధించి లబ్ధిదారులను గుర్తించేందుకు ఈనెల 16 నుంచి 20 వరకు గ్రామాల్లో సర్వే నిర్వహించారు. రైతు భరోసాకు సంబంధించి రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించి ఉపాధిహామీ ఉద్యోగులు పరిశీలన చేశారు. గృహ నిర్మాణశాఖ వారు చేయాల్సిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే, రెవెన్యూ శాఖ చేయాల్సిన రేషన్ కార్డుల పరిశీలన బాధ్యతను పంచాయతీ కార్యదర్శులు మోయాల్సి వచ్చింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. 21 నుంచి మొదలైన గ్రామ సభల్లో వివిధ పథకాలకు సంబంధించి జాబితాలో పేరులేని వారు స్థానికంగా ఉండే పంచాయతీ కార్యదర్శులను నిలదీస్తున్నారు. వారికి ప్రజలకు సమాధానం చెప్పలేక కార్యదర్శులు సతమతమవుతున్నారు.

సమాధానం చెప్పలేకపోతున్నాం



ఈ మధ్యకాలంలో సర్వే పేరుతో ఒక్కో కుటుంబం వద్దకు మూడు నాలుగు సార్లు వెళ్లాం. జాబితాలో పేరు వచ్చిన వారు, రానివారు ప్రతి ఒక్కరు ప్రతి పథకానికి సంబంధించి పంచాయతీ కార్యదర్శినే బాధ్యుడిని చేసి మాట్లాడుతున్నారు. ప్రజల సందేహాలకు సమాధానం చెప్పలేకపోతున్నాము. పథకాల లబ్ధిదారుల ఎంపిక, అమలు బాధ్యత శాఖల వారీగా అప్పగిస్తే బాగుంటుంది.

– పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, శోభనాద్రిపురం

పనిభారంతో సతమతమవుతున్నాం



ఇటీవల ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు విజయవంతం చేయడానికి రాత్రింబవళ్లు పని చేయాల్సి వచ్చింది. సెలవురోజులు, పండుగ సమయాల్లోనూ పనిచేశాం. సంబంధం లేని శాఖకు సంబంధించిన పనులు అప్పగించడం వల్ల పనిభారంతో సతమతమవుతున్నాం.

– చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు, రామన్నపేట

ఆర్‌పీలకు వేతనాలు వచ్చేశాయ్!

- ఆరు నెలల బకాయిలు విడుదల
- 96 మంది ఆర్‌పీలకు రూ.34.56 లక్షలు మంజూరు

భువనగిరి: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో పనిచేస్తూ మున్సిపాలిటీ పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాల పొదుపు లెక్కలు, బ్యాంకు రుణాలు ఇప్పించే బాధ్యత చూసే ఆర్‌పీ (రిసోర్స్‌పర్సన్)లకు వేతనాల బకాయిలు విడుదలయ్యాయి. ఈ ఏడాది జూన్ నుంచి వేతనాలు నిలిచిపోగా.. సంఘాల బాధ్యతతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాలుపంచుకునే ఆర్‌పీలకు చాలీచాలని వేతనం ఇస్తున్నారు. అది కూడా సకాలంలో అందడం లేదు. ఈ ఏడాదికి సంబంధించి ఆరు నెలల వేతనాలు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆరు నెలల వేతనాలు విడుదల చేసింది. జిల్లాలో ఆరు మున్సిపాలిటీల పరిధిలో పనిచేస్తున్న 96 మంది ఆర్‌పీలకు రూ.34.56 లక్షల విడుదల అయ్యాయి. ఈ నిధులు మహిళా స్వయం సహాయక సంఘాల సమాఖ్య ఖాతాల్లో జమ అయ్యాయని మెప్మా పరిపాలన జిల్లా అధికారి రమేష్ బాబు తెలిపారు.

విడుదలైన వేతన బకాయిలు ఇలా..

మున్సిపాలిటీ	ఆర్‌పీల సంఖ్య	వేతనం
భువనగిరి	41	రూ. 14.76 లక్షలు
ఆలేరు	11	రూ. 3.96 లక్షలు
చౌటుప్పల్	14	రూ. 5.04 లక్షలు
యాదగిరిగిగుట్ట	08	రూ. 4.32 లక్షలు
మోత్కూర్	10	రూ. 3.60 లక్షలు
పోచంపల్లి	12	రూ. 4.32 లక్షలు
మొత్తం	96	రూ.34.56 లక్షలు

నెలకు రూ. 600 నుంచి విధులు..

గతంలో ప్రభుత్వం మెప్మా ఆర్‌పీలకు నెలకు రూ. 600 పారితోషికం అందించేది. ఆ తర్వాత ఆ పారితోషికాన్ని వెయ్యికి తరువాత రూ.రెండు వేలకు పెంచుతూ వచ్చింది. 2018 నుంచి ఆర్‌పీలకు నెలకు రూ. 4వేలు వేతనం, పట్టణ సమాఖ్య నుంచి మరో రూ.2వేలు కలిపి రూ. 6వేల చొప్పున స్త్రీ నిధి ద్వారా చెల్లిస్తున్నారు. అయితే వేతనం ప్రభుత్వం ఇవ్వకుండా స్త్రీ నిధి ద్వారా పారితోషికం ఇవ్వడాన్ని ఆర్‌పీలు వ్యతిరేకిస్తున్నారు. కనీస వేతన విధానం అమలు చేయాలని గత ప్రభుత్వం హయాంలో మంత్రులు, అధికారులకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చాక కూడా హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ధర్నాలు సైతం చేశారు.

క్లుప్తంగా

ఐదుగురు బాల కార్మికులకు విముక్తి

చౌటుప్పల్: ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో మంగళవారం పోలీసులు పలు దుకాణాల్లో పనిచేస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన ఐదుగురు బాల కార్మికులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. బాలలను పనిలో పెట్టుకున్న వారిపై కేసు నమోదు చేస్తామని సీఐ మన్మథకుమార్ తెలిపారు. బాలలను యాదాద్రి భువనగిరి జిల్లా బాలల పరిరక్షణ అధికారికి అప్పగిస్తామని పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం


చాగోని యాదగిరి

అడ్డగూడూరు: మండల పరిధిలోని చిర్రగూడూరు గ్రామానికి చెందిన చాగోని యాదగిరి అదృశ్యమైనట్లు మంగళవారం అడ్డగూడూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 26వ తేదీ ఉదయం యాదగిరి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అతడు చౌల్లరామారం గోదాం వద్ద మోత్కూర్ వైపు వెళ్లే ఆటో ఎక్కినట్లు స్థానికులు గుర్తించారు. మంగళవారం యాదగిరి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

లాడ్జిలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని ఓ లాడ్జిలో సోమవారం అర్ధరాత్రి అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందాడు. పట్టణ సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం ఈదులూరు గ్రామానికి చెందిన షేక్ గాలిబ్ (45) సోమవారం అర్ధరాత్రి యాదగిరిగుట్ట పట్టణంలోని పద్మజా లాడ్జికి ఓ మహిళతో వచ్చాడు. లాడ్జిలో ఓ గది తీసుకొని బస చేశారు. మంగళవారం ఉదయం 5గంటల సమయంలో గాలిబ్‌తో వచ్చిన మహిళ వెళ్లిపోయింది. ఉదయం 8 అవుతున్నా గాలిబ్ గది నుంచి బయటకు రాకపోవడంతో లాడ్జి నిర్వాహకులు గదిలోకి వెళ్లి చూడగా అతడు మృతిచెంది ఉన్నాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ సీఐ రమేష్ తెలిపారు. గాలిబ్‌తో పాటు వచ్చిన మహిళ ఎవరనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైలు ఢీకొని..


జగదీష్ (ఫైల్)

ఆలేరురూరల్: రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి ఆలేరు రైల్వే స్టేషన్‌లో జరిగింది. మంగళవారం భువనగిరి రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా అల్వాల్ పరిధిలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన కొటారి జగదీష్(41) జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం(ఎన్ఆర్ఈజీఎస్)లో ఉద్యోగం చేస్తున్నాడు. ప్రతిరోజు సికింద్రాబాద్ నుంచి రైలులో ఆలేరు వరకు వచ్చి అక్కడ నుంచి బైక్‌పై బచ్చన్నపేటకు వెళ్లేవాడు. సోమవారం సాయంత్రం బచ్చన్నపేటలో విధులు ముగించుకుని బైక్‌పై ఆలేరు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. రాత్రి సికింద్రాబాద్ వైపు వెళ్లేందుకు ఆలేరు రైల్వే స్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫాం నుంచి ఒకటో ప్లాట్‌ఫాంకు పోయేందుకు రైలు పట్టాలు దాటుతుండగా సికింద్రాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టడంతో మృతిచెందాడు. జగదీష్ శరీరభాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు జగదీష్ శరీరభాగాలను ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం ఉదయం రైల్వే పోలీసులు జగదీష్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఏసీబీ వలలో ఎస్ఐ, కానిస్టేబుల్

- రూ.70 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు



తిరుమలగిరిలో పట్టుబడ్డ ఎస్ఐ సురేష్, కానిస్టేబుల్ నాగరాజు

తిరుమలగిరి (తుంగతుర్తి): సూర్యాపేట జిల్లా తిరుమలగిరి పోలీస్ స్టేషన్ ఎస్ఐ సురేష్, కానిస్టేబుల్ నాగరాజు రూ.70 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు అడ్డంగా దొరికారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 12వ తేదీన కోదాడ నుంచి తిరుమలగిరి మీదుగా డీసీఎంలో రేషన్ బియ్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న వారు సిద్దిపేట జిల్లా వడ్డేపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్ పేరు చెప్పడంతో అతడిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో చంద్రశేఖర్ పేరు తొలగించడానికి ఎస్ఐ సురేష్ రూ.3 లక్షలు లంచం డిమాండ్ చేశాడు. చివరకు రూ.1.40 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఎస్ఐ డబ్బులు డిమాండ్ చేయడంతో చంద్రశేఖర్ నల్లగొండ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మొదటి విడతగా రూ.30వేలను లక్ష్మి ఫిల్లింగ్ స్టేషన్ ఫోన్ పే ద్వారా బదిలీ చేశాడు. మరో రూ.10 వేలను కానిస్టేబుల్ నాగరాజుకు ఫోన్ పే ద్వారా పంపాడు. మరో రూ.30 వేలను ఎస్ఐ సురేష్‌కు బదిలీ చేశాడు. మిగతా రూ.70 వేలను మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐకి ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఎస్ఐ, కానిస్టేబుల్‌ను అరెస్ట్ చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో డీఎస్పీ జగదీష్‌చందర్, సీఐ వెంకట్‌రావు, రామారావు, శ్రీధర్, నరేష్, సంపత్ ఉన్నారు.

ఎస్ఐ అసభ్య పదజాలంతో దూషించాడు : చంద్రశేఖర్



రేషన్ బియ్యం కేసులో తనకు ఎటువంటి సంబంధం లేదని, గతంలో తన తమ్ముడు రత్నాకర్ రేషన్ బియ్యం వ్యాపారం చేసేవాడని బాధితుడు చంద్రశేఖర్ తెలిపాడు. తన తమ్ముడు పరారీలో ఉండటంతో ఎస్ఐ కావాలనే తన పేరును ఈ కేసులో ఇరికించి తన వద్ద నుంచి రూ.3 లక్షలు డిమాండ్ చేశాడని పేర్కొన్నాడు. ఈ కేసుతో తనకు సంబంధం లేదని ఎస్ఐ కాళ్లు పట్టుకున్నా.. కనికరించకుండా అసభ్య పదజాలంతో దూషించాడని, దీంతో ఏసీబీని ఆశ్రయించినట్లు చంద్రశేఖర్ వివరించాడు.

బైక్ చోరీ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

చివ్వెంల(సూర్యాపేట): బైక్ చోరీ కేసులో ఇద్దరు వ్యక్తులకు ఆరు నెలల 15 రోజులు జైలు శిక్ష విధిస్తూ సూర్యాపేట జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గోపు రజిత మంగళవారం తీర్పు వెలువరించారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌కు చెందిన సలిగంటి గణేష్ 2024 జూన్ 5వ తేదీన తన బైక్‌ను సూర్యాపేట పట్టణంలోని రమేష్ హస్పిటల్ వద్ద తన స్నేహితుడు ఉండటంతో అక్కడ పెట్టి హైదరాబాద్‌కు వెళ్లాడు. తిరిగి సూర్యాపేటకు వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. అప్పటి ఎస్ఐ మహేంద్రనాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు పట్టణానికి చెందిన దాతి నవీన్, దండూరి సాయిరాజ్‌ను బైక్ అపహరించినట్లు పోలీసులు గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. పలువురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి.. పీపీ బి.హేమలతనాయుడు వాదనలతో ఏకీభవిస్తూ నిందితులకు 6 నెలల 15 రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. పీపీకి కోర్టు కానిస్టేబుల్ రవి సహకరించారు.

భారత దివ్యాంగుల క్రికెట్ జట్టుకు వస్త్రాంనాయక్ ఎంపిక


ధనావత్ వస్త్రాంనాయక్

త్రిపురారం: నల్లగొండ జిల్లా త్రిపురారం మండలంలోని మాటూర్ గ్రామానికి చెందిన ధనావత్ వస్త్రాంనాయక్ భారత దివ్యాంగుల క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారు. బోర్డు ఆఫ్ డిజేబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ (ఇండియా) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 13 నుంచి 20వ తేదీ వరకు నేపాల్‌లో జరిగే టీ20, రెండు వన్డే ఇంటర్నేషనల్ సిరీస్ మ్యాచ్‌ల్లో ఇండియా తరఫున వస్త్రాంనాయక్ ఆడనున్నారు. గిరిజన బిడ్డగా భారత దివ్యాంగుల జట్టుకు వస్త్రాంనాయక్ ఎంపిక కావడం పట్ల బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

కలెక్టర్ ఆదేశాలతో వానరానికి వైద్యం


వానరాన్ని మచ్చిక చేసుకుని వైద్యం చేస్తున్న పశు వైద్యుడు పెంటయ్య

కోదాడరూరల్: విద్యుత్తాఘాతానికి గురై గాయపడిన వానరానికి కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్యం చేయించి ప్రాణాలు కాపాడారు. కోదాడ పట్టణంలోని శ్రీవిద్య కళాశాల వీధిలో ఉంటున్న మంచుకంటి భాస్కర్ ఇంటి ఆవరణలో మంగళవారం ఓ వానరం విద్యుదాఘాతానికి గురై నడవలేని స్థితిలో పడి ఉంది. భాస్కర్ వానరాన్ని గమనించి దానికి వైద్యం అందించేందుకు స్థానిక వెటర్నరీ డాక్టర్‌కు ఫోన్ చేయగా ఆయన తన సిబ్బందిని పంపించారు. గాయాలతో భయంగా ఉన్న వానరం వైద్యానికి సహకరించడం లేదని, దానిని మున్సిపల్ సిబ్బంది పట్టుకోవాలని వైద్య సిబ్బంది భాస్కర్‌కు తెలిపారు. దీంతో భాస్కర్ మున్సిపల్ సిబ్బందికి ఫోన్ చేస్తే ఫారెస్ట్ అధికారులకు చెప్పండని సమాధానమిచ్చారు. ఫారెస్ట్ అధికారికి ఫోన్ చేస్తే బీట్ అధికారికి ఫోన్ చేయమన్నారు. బీట్ అధికారికి ఫోన్ చేస్తే తాను హైదరాబాద్‌లో ఉన్నానని సమాధానం ఇచ్చాడు. దీంతో భాస్కర్ వాట్సాప్ ద్వారా గాయాలతో ఉన్న వానరం ఫొటోను సూర్యాపేట కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు పంపి విషయం తెలియజేశాడు. వెంటనే స్పందించిన కలెక్టర్ వానరానికి వైద్యం అందించాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పశు వైద్యులు పెంటయ్య, మధు, సురేందర్ తమ సిబ్బందితో అక్కడకు చేరుకొని వానరాన్ని మచ్చిక చేసుకొని వైద్యం అందించి దానికి ఉపశమనం కలిగించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన అర్హులైన బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలంగాణ వెనుకబడిన తరగతుల ఉపాధి నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రం సంచాలకుడు ఖాజా నజీమ్ అలీ అఫ్సర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే వారు డిగ్రీ ఉత్తీర్ణులై, 18 నుంచి 39 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షలు ఉండాలని తెలిపారు. ఫిబ్రవరి 9వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రిజర్వేషన్, ఇంటర్, డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ మెమోల జిరాక్స్‌లు, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జిరాక్స్, దరఖాస్తుదారుని పాస్‌ఫొటో, ఆధార్‌కార్డు జిరాక్స్ స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 08682-220007 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ట్రాక్టర్ ట్రాలీ చోరీ

త్రిపురారం: గుర్తుతెలియని వ్యక్తులు ట్రాలీ చోరీ చేశారు. ఈ ఘటన నిడమనూరు మండలంలోని సీతలతండాలో జరిగింది. మంగళవారం నిడమనూరు ఎస్ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. సీతలతండాకు చెందిన ఇస్లావత్ జూదతర ట్రాక్టర్‌ను ఇంటి వద్ద ఖాళీ స్థలం లేకపోవడంతో ధన్‌సింగ్‌తండా దారిలో కోళ్లఫాంకు సమీపంలో ఉన్న ఎయిర్‌టెల్ టవర్ వద్ద పార్కింగ్ చేస్తున్నాడు. సోమవారం ట్రాక్టర్ పనులు ముగించుకొని వచ్చి తిరిగి ఇదే ప్రాంతంలో రాత్రి సమయంలో పార్కింగ్ చేసి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి ట్రాక్టర్ ట్రాలీ కనబడలేదు. గుర్తుతెలియని దుండగులు ట్రాక్టర్ ట్రాలీని దొంగతనం చేసినట్లు గుర్తించి పోలీసలుకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోదాడరూరల్ : పేకాట ఆడుతున్న ఏడుగురిని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రంజిత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో లక్ష్మీనారాయణ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి ఏడుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3135 నగదు, రెండు ఫోన్లను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మేత కోసం పశువుల వలస బాట


దేవరకొండ ప్రాంతం నుంచి పశుగ్రాసం కోసం వందలాది ఆవులు, లేగ దూడలను రైతులు నకిరేకల్, కేతేపల్లి ప్రాంతాలకు తరలిస్తున్నారు. మంగళవారం తాటికల్ రోడ్డు మీదుగా నకిరేకల్ వైపు వెళ్తున్న పశువులు సాక్షి కెమెరాకు చిక్కాయి. - నకిరేకల్

ఆర్ఎంపీ వైద్యుడిని బెదిరించిన యువకులు

- లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్
- పోలీసులకు అప్పగించిన స్థానికులు

హుజూర్‌నగర్: ముగ్గురు యువకులు ఆర్ఎంపీ వైద్యుడిని బెదించిన ఘటన మంగళవారం హుజూర్‌నగర్‌లో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని మట్టపల్లి రోడ్డులో ఆర్ఎంపీ వైద్యుడు ఎస్‌కే హుస్సేన్‌బాబు నిర్వహిస్తున్న చికిత్సా కేంద్రం వద్దకు మంగళవారం ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చారు. 'నీకు ఏం అర్హత ఉందని వైద్యం చేస్తున్నావు, నీపై డీఎంహెచ్ఓకు ఫిర్యాదు చేశాం. రూ.లక్ష ఇవ్వాలి' అని అతడిని దాడికి యత్నించి భయభ్రాంతులకు గురిచేశారు. చుట్టుపక్కల వారు గమనించి ముగ్గురు యువకులను పట్టుకుని పోలీసు స్టేషన్ తీసుకెళ్లారు. పట్టుబడిన వారు సూర్యాపేట ప్రాంతానికి చెందిన వి. లింగయ్య, మహేష్, రాజేష్‌గా పోలీసులు గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులతో తనకు ప్రాణహాని ఉందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఎస్ఐ ముత్తయ్యను సంప్రదించగా కేసు నమోదు చేయలేదని తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు రావాలని సీఎంకు ఆహ్వానం


బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

నార్కట్‌పల్లి : చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశం, అర్చకులు ఆహ్వానం అందజేశారు. ప్రసిద్ధ శివక్షేత్రంగా వెలుగొందుతున్న చెర్వుగట్టుకు ప్రతి అమావాస్య రోజున వేలాది భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుంటున్నారని వివరించారు. ఫిబ్రవరి 2 నుంచి 9వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు ఉన్నాయని.. ముఖ్యమంత్రితోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు విచ్చేయాలని కోరినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు ముఖ్యమంత్రికి, మంత్రులకు వేర్వేరుగా ఆశీర్వచనం, ప్రసాదం అందజేశారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో ఈఓ నవీన్‌కుమార్, ప్రధాన అర్చకుడు రామలింగేశ్వర శర్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, వడ్డె భూపాల్‌రెడ్డి, బండా సాగర్‌రెడ్డి, నేతగాని కృష్ణ, నల్ల వెంకన్న, శిరిధర్‌రెడ్డి, రేగట్టే నవీన్‌రెడ్డి, వరాల రమేష్, నర్సిరెడ్డి, జెరిపోతుల బారత్, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, సురేశ్‌శర్మ, శ్రీకాంత్ శర్మ తదితరులు ఉన్నారు.

బంగారు తాపడానికి విరాళాలు అందజేత


చెక్కు అందజేస్తున్న వేణుగోపాల్‌రావు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ విమాన గోపురానికి బంగారు తాపడం కోసం హైదరాబాద్‌లోని మాదాపూర్‌కు చెందిన ఎస్. వేణుగోపాల్‌రావు, ఎల్. మారుతీశంకర్ రూ.1,11,116 చొప్పున విరాళం ప్రకటించారు. మంగళవారం స్వామివారిని దర్శించుకున్న వారు చెక్కులను ఆలయాధికారి రమేష్‌బాబు, ఉప ప్రధానార్చకుడు మాధవాచార్యులకు అందజేశారు.

బీఆర్ఎస్ ర్యాలీలో దొంగల చేతివాటం

- పలువురు నేతల బంగారు గొలుసులు, సెల్‌ఫోన్లు అపహరణ

నల్లగొండ: నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో మంగళవారం మాజీ మంత్రి కేటీఆర్ పాల్గొన్న రైతు మహా ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు నిర్వహించిన ర్యాలీలో దొంగలు రెచ్చిపోయారు. ఎన్జీ కాలేజీ నుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. కేటీఆర్ రాగానే ఆయనకు స్వాగతం పలికే క్రమంలో ఒకరిని ఒకరు తోసుకుంటూ కేటీఆర్ వద్దకు వెళ్లే ప్రయత్నం చేయగా.. దొంగలు తమ చేతివాటం ప్రదర్శించి ఆరుగురు నాయకుల బంగారు గొలుసులు, మరో ఇద్దరు వ్యక్తుల సెల్‌ఫోన్లు చోరీ చేశారు. ఎన్జీ కాలేజీ సర్కిల్ వద్ద అన్నిరెడ్డి లక్ష్మారెడ్డి మెడలోని ఒకటిన్నర తులాల బంగారు గొలుసు, గడియారం సెంటర్‌లో నల్లగొండకు చెందిన బైరగోని గణేష్‌కు చెందిన ఒకటిన్నర తులాల గొలుసు, బొడ్డు శంకర్‌కు చెందిన 2 తులాల బంగారు గొలుసు, కొండాపురానికి చెందిన అద్దెల కృష్ణారెడ్డి మెడలో ఉన్న ఒకటిన్నర తులాల గొలుసు, సూర్యాపేట జిల్లా నూతన్‌కల్‌కు చెందిన కొమ్ము కోటేష్ రెండున్నర తులాల బంగారు గొలుసుతో పాటు మరో మహిళ మెడలో ఉన్న 2 తులాల బంగారు ఆభరణాలు దొంగలు చోరీ చేశారు. నల్లగొండకు చెందిన హమీద్ సెల్‌ఫోన్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. చోరీకి పాల్పడిన దొంగల ముఠాలోని ఒక వ్యక్తిని నల్లగొండ టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

- 9 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడరూరల్: గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను మోతె పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసు వివరాలను మంగళవారం కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరికి చెందిన బుర్రం సాయికుమార్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని అల్లూరి సీతారామరాజు కాలనీకి చెందిన గుండి మురళీకృష్ణ, రాజుపేట కాలనీకి చెందిన బాణోతు ఫణికుమార్ కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దులోని డొంకరాయి గ్రామంలో 9.3 కేజీల గంజాయిని కేజీ రూ.2500 చొప్పున కొనుగోలు చేశారు. ఆ గంజాయిని ఎక్కువ రేటుకు విక్రయించేందుకు స్కూటీపై ఖమ్మం మీదుగా హైదరాబాద్‌కు బయల్దేరారు. విశ్వసనీయ సమాచారం మేరకు మోతె ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి మోతె మండలం మామిళ్లగూడెం శివారులోని టోల్‌ప్లాజా వద్ద నిఘా పెట్టి స్కూటీపై వస్తున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద బ్యాగులను తనిఖీ చేసి నాలుగు ప్యాకెట్లలో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. 9 కిలోల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు, స్కూటీని స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, మోతె ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి, సిబ్బంది శ్రీనివాస్, సతీష్ నాయుడు, ఎల్లారెడ్డి, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం చేస్తాం


హుజూర్‌నగర్ : డీఎస్ నకార విగ్రహాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య, నాయకులు

హుజూర్‌నగర్ : రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఉద్యమం చేస్తామని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య స్పష్టం చేశారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని పెన్షనర్ల సంఘ కార్యాలయంలో పెన్షనర్ల పితామహుడు డీఎస్ నకార విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి ఎన్ని వినతి పత్రాలు ఇచ్చినా ఆర్థిక పరిస్థితి బాగా లేదనే నెపంతో సమస్యలను పరిష్కరించకుండా దాటవేస్తున్నారని ఆరోపించారు. సమస్యల పరిష్కారానికి మార్చి వరకు గడువు అడిగారని ఆయన తెలిపారు. అప్పటికల్లా పీఆర్‌సీ, పెండింగ్‌లో ఉన్న డీఏ తదితర సమస్యలను పరిష్కరించకపోతే పోరుబాట తప్పదని అన్నారు. నకార విగ్రహానికి కావాల్సిన రూ. 35 వేలను ఇచ్చిన పెన్షనర్ బెల్లంకొండ రామలక్ష్మిని ఆయన అభినందించారు. మార్చిలో కోదాడలో రాష్ట్రస్థాయి పెన్షనర్ల ఉత్సవాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని దీనిలో భాగంగా క్రీడలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. అనంతరం పెన్షనర్ల సామూహిక జన్మదిన వేడుకలు నిర్వహించి సత్కరించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్. సుదర్శన్ రెడ్డి, బి. రాంబాబు, నాయకులు సోమయ్య, పూర్ణచంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, భాస్కర్ రెడ్డి, వీరారెడ్డి, చంద్రశేఖర్, ఎంఎస్ఎన్ రాజు, కేవీఎన్ మూర్తి, ధర్మూరి వెంకటేశ్వర్లు, అంకతి అప్పయ్య, మొయినుద్దీన్, దేవదానం, ఎస్. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతుల్లో పశుగ్రాసం సాగు

పాడి పంట


సాగులో ఉన్న పశుగ్రాసం

పెద్దవూర: పశుగ్రాసం అంటే రైతులకు గుర్తుకొచ్చేది జొన్న, వరి, సజ్జ తదితర తృణధాన్యాలు. వీటిలో పశువులకు కావాల్సిన పోషకాలు లభించవు. పైగా వీటికి ఖర్చు అధికం. జీర్ణంకాని భాగం ఎక్కువే. శాస్త్రీయ పద్ధతిలో నాణ్యమైన పశుగ్రాసం అందిస్తే పశువులు ఆరోగ్యంగా ఉంటాయి. అధికంగా పాల ఉత్పత్తి సాధించవచ్చు. పశుగ్రాసం సాగు ఖర్చు తగ్గించవచ్చు. డెయిరీ ఫారంల నిర్వహణ వ్యయంలో 70శాతం వరకు పశువుల మేతకే సరిపోతుంది. అందువల్ల మేత ఖర్చును తగ్గిస్తే అంతమేరకు లాభాలు పెంచుకునే అవకాశం ఉంది. అలాగే పాల శీతలీకరణ అధికారులు పాలు సప్లయ్ చేసే రైతులకు 50 శాతం సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు అందిస్తారు. పశుసంవర్థక అధికారులు సైతం 50శాతం రాయితీపై విత్తనాలు ఇవ్వనున్నారు. పశువుల కాపరులు వీటిని సద్వినియోగం చేసుకుని పశుగ్రాసం సాగు చేస్తే గడ్డి కొరత తీరుతుందని మండల పశువైద్యాధికారి డాక్టర్ నులక నాగార్జున్‌రెడ్డి సూచించారు.

పశుగ్రాసం సాగు విధానం

- పశుగ్రాసం విత్తనాల్లో ప్రధానమైనవి సూపర్ నైపర్, కో1, కో 2, ఎస్ఎస్‌జీ–825 రకాలు.
- 85శాతం పచ్చి మేతను ఈ రకాల ద్వారా తీర్చుకోవచ్చు.
- ఒకసారి నాటితే 4 నుంచి 5 ఏళ్ల వరకు దిగుబడులు పొందవచ్చు.
- జనవరి నుంచి ఆగస్టు నెల వరకు విత్తనాలు విత్తుకోవచ్చు.
- అన్నిరకాల నేలల్లో సాగు చేసుకోవచ్చును. ఆమ్లగుణాలు గల నేలల్లో అధిక దిగుబడి ఉంటుంది.
- పశుగ్రాసాల సాగుకు ప్రత్యేకంగా స్థలం కేటాయించలేని వారు తోటలు, కూరగాయ పంటల్లో అంతర పంటగా సాగు చేసుకోవచ్చు.
- ఎకరాకు 16 నుంచి 20 కిలోల విత్తనం అవసరం. మిశ్రమ పంటగా కూడా సాగు చేసుకోవచ్చు.
- దుక్కిలో 4 నుంచి 5 టన్నుల కంపోస్టు ఎరువు, 22 కిలోల యూరియా, 16 నుంచి 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి.
- విత్తిన 45 రోజుల తర్వాత ఎకరాకు 22 కిలోల యూరియా వేయాలి. ఎకరానికి 20 టన్నుల దిగుబడి వస్తుంది.

పాల దిగుబడి ఎక్కువే

పశుగ్రాసం సాగుకు తక్కువ శ్రమ పెట్టుబడి అవసరం అవుతుంది. విత్తనాలు నాటిన కొద్దిరోజుల్లోనే పశుగ్రాసం కోతకు వస్తుంది. పచ్చిమేత రుచికరంగా ఉండటం వలన పశువులు ఇష్టంగా తింటాయి. సులభంగా జీర్ణం చేసుకుంటాయి. పచ్చిమేత వలన పాల దిగుబడులు 25 శాతం వరకు పెరుగుతుంది. పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుంది. దాణా అవసరం లేకుండా కేవలం పచ్చిమేత ద్వారా 5 నుంచి 6 లీటర్ల పాల దిగుబడి సాధించవచ్చు. పచ్చి మేతలో కాల్షియం, భాస్వరం వంటి మాంసకత్తులతో పాటు ఏ, డీ, ఈ విటమిన్లు, పిండి, కొవ్వు పదార్థాలు అధికంగా ఉంటాయి. నీరు తక్కువగా ఉన్న ప్రాంతాల్లోనూ పశుగ్రాసాలను సాగు చేసుకోవచ్చు.

- అధిక విస్తీర్ణంలో సాగు చేసి సైలేజ్ లేదా ఎండి గడ్డి రూపంలో నిల్వ చేసి వాడుకోవచ్చు.